# రమణభాస్కర

## (సద్గురు శ్రీ నాన్నగారి అనుగ్రహభాషణములు, 24-02-2002, జిన్నూరు)

ప్రియమైన ఆత్మబంధువుల్లారా,

రామనామము లక్ష్మీప్రదమైనది. రాముని రూపంకంటే రామనామం గొప్పది అని చెపుతారు. శ్రీరామచంద్రమూర్తిని మర్యాదపురుషోత్తముడు అంటారు. ఎవరైనా తెలిసినవారు కనిపిస్తే ముందుగా ఆయనే ప్రేమతో పలకరించేవాడట, ఆయనకు ఎవరైనా ఎదురు వస్తూ ఉంటే ముందు ఆయనే ప్రక్కకు ఒదిగేవాడట. ఆయన స్వయంగా చక్రవర్తి, ఒక మహారాజు కుమారుడు, ఇంకో మహారాజుకు అల్లుడు అయినప్పటికి ఆయనలో ఎంతో వినయం మనకు కనబడుతుంది. వినయం అనేది ఆయనను చూసి మనం నేర్చుకోవాలి. రామాయణం అంతా ప్రేమమయం. సర్వసాధారణంగా అన్నదమ్ములు ఆస్తులకోసం పేచీలు పడతారు కాని ఆస్తులు నాకువద్దు అంటే నాకువద్దనే అన్నదమ్ములు రామాయణంలోనే కనబడతారు, రాముడి అన్నదమ్ములకు అది సరిపోయింది. మనకు తెలివితేటలు ఎప్పుడూ సమానంగా ఉండవు. తెలివితేటలు తక్కువగా ఉన్నప్పుడు ఉద్రేకంగా మాట్లాడతాము. గుణాతీతుడికి కూడా గుణాల వలన వచ్చే తలంపులు రావచ్చు, వచ్చినా అవి వాడి మనస్సును గాయం చెయ్యవు. కొంతమందికి త్యాగబుద్ధి ఉంటుంది గాని స్వయంగా బాధలు భరించలేరు, రాముడికి త్యాగబుద్ధి ఉంది, బాధలను కూడా ప్రశాంతంగా భరించగలడు. రామచంద్రమూర్తి వాలితో చెపుతాడు నీవు కారణంలేకుండా సుగ్రీవుడిని బాధించావు, రాజ్యంలోనుండి తరిమేసావు, కాని నీవు నా చేత చంపబడటంవలన నీ బుద్ధిలో ఉన్న దోషాలు అన్నీ పోయాయి, నీ బుద్ధి శుద్ధి అయ్యింది, వైకుంతానికి వెళ్ళిపోతున్నావు, ఇంకేమి కావాలి వాలీ , నీకు దు:ఖం వద్దు, మోహం వద్దు అని వాలితో రామచంద్రమూర్తి చెపుతాడు. దేహప్రారబ్ధమును ఇష్టముతో అనుభవించండి, ఇష్టముతో ప్రారబ్దమును అనుభవించటం వలన పునర్జన్మ హేతువులు అన్నీ కాలిబూడిద అవుతాయి.

రామనామం స్మరించటం వలన బుద్ధిలో ఉన్న దోషాలు అన్నీపోయి మనం పవిత్రులమవుతాము. మనలను ఎవరైనా చంపటానికి వస్తే వెర్రికేకలు వేస్తాము కాని గాంధీజీని తుపాకీతో కాల్చినప్పడు హేరామ్, హేరామ్ అంటూ చివరిశ్వాస విడిచారు. ఆయన భక్తుడు. నేను పిల్లవాడిగా ఉన్నప్పడు నాకు భయం చాలా ఎక్కువగా ఉండేది కాని రామనామం స్మరించి స్మరించి భయరహితుడను అయ్యాను అని గాంధీజీ చెప్పారు. జపధ్యానములు చేసుకొనే ఋషులను రాక్షసులు బాధపెడుతూ ఉంటే వారు వచ్చి, రాముడికి చెపుతారు. మిమ్మల్ని ఎవరైతే బాధపెడుతున్నారో వారిని సంహరిస్తాను అని రాముడు చెపుతాడు. వారి గొడవ మనకు ఎందుకు అని సీత రాముడితో అంటుంది. అయితే మనం ఈ భూమి మీదకు ఎందుకు వచ్చినట్లు, మనం రాక్షస సంహారం కోసం ఈ భూమి మీదకు వచ్చాము అది మర్చిపోవద్దు అన్నాడు రాముడు. రాముడు పైకి అతిసామాన్యుడిలా కనబడతాడు, కాని లోపల అతిబలవంతుడు. మనం కుటుంబంలో ఎలావ్యవహరించాలి, సోదరులు ఎలా ఉండాలి అనేది మనకు రామాయణంలో కనబడుతుంది. మనం అన్నదానం చేయవచ్చు, వస్త్రదానం చేయవచ్చు, విద్యాదానం చేయవచ్చు కాని లోపలనుండి ఆత్మజ్ఞానం సముపార్జించాలి అనే కాంక్షను కలుగజేయటం అన్ని దానాలలోనికి గొప్పది, అది ఒక్క జ్ఞానికే సాధ్యం. మనం నిర్మలంగా, నిశ్చలంగా, నిరహంకారముగా ఒక మంచిపని చేస్తే దాని ఫలితం ఏదో రోజు వస్తుంది. మీరు చేసి మర్చిపోండి కాని దేవుడు మర్చిపోడు. ఆ ఫలం ఏదో రోజు ఇస్తాడు. మీరు చేసే పని మాత్రం నిర్మలంగా చేయండి, సాత్విక బుద్ధితో చేయండి, రజోగుణంతో, తమోగుణంతో చేయవద్దు. మనం ఏదో ఒకటి అనుకొంటూ ఉంటాము. మనం వైశ్యులమని, మనం రాజులమని, ఇండియా వారమని, అమెరికా వారమని ఇలా ఏదో ఒకటి అనుకొంటూ హద్దులు పెట్టుకొని, మనస్సులో వికారములు పెట్టుకొని పతనమవుతున్నాము. మనం చైతన్య స్వరూపులమనే గ్రహింపు మనకు రావటంలేదు. మనకు ఒక మంచిఆలోచన వచ్చింది అనుకోండి, ఒక మంచి తలంపువచ్చింది అనుకోండి దానిని ఆచరణలో పెట్టలేకపోతూఉంటే నీ బుద్ధిలో దోషం ఉంది అని గుర్తు. ఆ దోషాన్ని కాల్చి బూడిద చేయటానికి, నిన్ను పవిత్రుడిని చేయటానికి రామనామం నీకు సహకరిస్తుంది.

దైవీసంపద లేకపోతే, లోపల వైరాగ్యబలంలేకపోతే, వికాశం లేకపోతే, లోపల ప్రిపరేషన్ లేకపోతే ఆత్మజ్ఞానం కావాలి అంటే అంత తేలికగా వస్తుందా? ముందు దైవీగుణాలను సంపాదించాలి కదా అని ఒక భక్తుడు భగవాన్‌ను అడుగుతున్నారు. నీవు ఆత్మజ్ఞానం కోసం ప్రయత్నం చేస్తూ ఉంటే కళ్యాణగుణాలు అన్నీ నీకూడా వస్తాయి అంటున్నారు భగవాన్. నీవు వాటిని ప్రత్యేకంగా సంపాదించనక్కరలేదు. ఆత్మజ్ఞానసముపార్జనలోనే సద్గుణాలు అన్నీ సహజంగా వచ్చేస్తాయి. దేహమునేను అనే సంకల్పమే పాపము అన్నాడు యేసు. దేహము నీవు కాదు. నీవు కానిదానిని నీవు అనుకొంటున్నావు, అక్కడ నుండే పాపం ప్రారంభమవుతోంది.

కొంతమందికి ఈ నేను దేహం దగ్గర, కొంతమందికి మనస్సు దగ్గర, కొంతమందికి బుద్ధి దగ్గర ఆగిపోతుంది. ఈ దేహంలోనుండి, మనస్సులోనుండి, బుద్ధిలోనుండి విడుదల పొందితే గాని నీవు ఎవరో నీకు తెలియదు. ఈ నేను దేనితో తాదాప్యం పొందుతోందో వాటిలోనుండి విడుదల పొందటమే జ్ఞానం. సోమరితనం పనికిరాదు, సోమరితనం ఉన్నవాడు దేనికి పనికిరాడు. సోమరితనం ఉన్నవాడికి ఆత్మచింతన ఉండదు, విషయచింతనకు అలవాటు పడతాడు, అజ్ఞానంలో కూరుకొని పోతాడు. కొంతమందికి ఇంటిలో సంపద ఉన్నా మనస్సులో సంపద ఉండదు, మనస్సులో సంపద ఉండాలి. రామాయణంలో వాల్మీకి చెపుతాడు పాము నోటిలో ఉన్న విషం కంటే రాగద్వేషములు ప్రమాదకరమైనవి. పాము కరిస్తే ఆవిషం వలన ఈదేహం చనిపోతుంది కాని రాగద్వేషములలో ఉన్న విషం లక్షలాది జన్మలు తీసుకొని వస్తుంది, మరణానంతర జీవితం చీకటిమయం అవుతుంది. మనకు అహంభావన వేరుతో సహా నశించినప్పుడు సృష్టితో సన్నిహితసంబంధం ఏర్పడుతుంది. జ్ఞాని దేహం ఉండగానే సృష్టిని కౌగిలించుకొంటాడు. మన తల్లితండ్రులుగాని, బంధువులుగాని, స్నేహితులుగాని చూపలేనిప్రేమ జ్ఞాని నుండి ప్రవహిస్తుంది. తల్లితండ్రులు తిండి, బట్ట ఇస్తారు కాని ఒక్క జ్ఞాని మాత్రమే మనకు జ్ఞానాన్ని ఇవ్వగలడు. ఈ మధ్య ఒక తండ్రి కొడుకుకు ఏవో గొడవలు వచ్చాయి, విడిపోయారు. ఒక సందర్భంలో ఆ తండ్రి కొడుకుగురించి చెపుతూ వాడు చనిపోలేదు, వాడు బ్రతికే ఉన్నాడు అయినా వాడు మనవాడు కాదు కదా అన్నారు. అంటే వాడుఉన్నా మనకు ఏమీ ప్రయోజనం లేదు కదా అని. అలాగే నీకు మంచితనం ఉంది అనుకో, తెలివి ఉంది అనుకో, భక్తి ఉంది అనుకో ఇవి అన్నీ అహంభావనలో నుండి విడుదల పొందటానికి నీకు సహకరించకపోతే వాటివలన ప్రయోజనం ఏమి ఉంది? నీవు అహంభావనలోనుండి విడుదల పొందాలి కదా? అసలు కావలసింది అదే కదా,

వారు అలా అంటే బాగుండును, వీరుఇలా ఉంటే బాగుండును, వారు మారితే బాగుండును అని ఆలోచించుకొనే బదులు మనం మారటానికి ప్రయత్నం చేసుకొంటే వారితో సర్దుకొని ఈ లోకంనుండి బయటకు పోవచ్చును. అరణ్యవాసంలో రాముడు లక్ష్మణుడితో పర్ణశాల నిర్మించమని చెపితే, పలానా చోట నిర్మించమని చెపితో అక్కడ నిర్మిస్తాను అంతే గాని అప్పడే నన్ను పెద్దవాడిని చెయ్యవద్దు అంటాడు లక్ష్మణుడు. కాని మనకు పెద్దరికం కావాలి. మన చేతలో కపటం, మాటలో కపటం, లోపలఅంతా కపటం. ఇంక మనకు ఎవరు పెద్దరికం ఇస్తారు? మనం మంచివారము అనుకోకూడదు, చెడ్డవారము

**05-09-2002**



అనుకోకూడదు, మనగురించి మనం ఏమీ అనుకోకుండా ఉంటే మనకు ఆత్మజ్ఞానం కలుగుతుంది., ఏదోఒకటి అనుకోవటం వలన మనస్సు బాహ్యముఖానికి వచ్చేస్తుంది, ఆత్మజ్ఞానానికి దూరమవుతున్నాము. మన అజ్ఞానం ఏదోఒకటి అనుకోకుండా మనలను ఉండనివ్వదు. ఏది ఎలా జరగాలో అది అలా జరుగుతుంది. దాని గురించి ఆలోచించి నీ బుద్ధిని పాడుచేసుకోవద్దు. మన ఇష్టాలను ప్రక్కన పెట్టి భగవంతుడు చెప్పినట్లు నడుచుకొంటే జ్ఞానమును పొందవచ్చు. ఈశ్వరుడిని అది కావాలి, ఇది కావాలి అని అడిగితే శరణాగతి రాదు. కోరికలు లేకపోతే నీ శరణాగతి ఆరోజుకారోజు పరిపూర్ణమవుతుంది. శరణాగతి ఎప్పుడైతే పరిపూర్ణమయ్యిందో అహంభావన వేరుతో సహా నశిస్తుంది, అప్పుడు నారాయణుడు ఆయన స్వరూపాన్ని ఇస్తాడు. దేహాన్ని ప్రారబ్దానికి విడిచిపెట్టి, భగవంతుడిమీద భారంవేసి సాధనచేస్తూఉంటే మనోమూలంలోనికి వెళ్ళవచ్చు. మనోమూలంలోనికి వెళ్ళి అక్కడ ఉండగలిగితే మనస్సు నశిస్తుంది. అప్పుడు మనం ఎవరో మనకు తెలుస్తుంది, అదే జ్ఞానం. మీ మనస్సులో ఉన్న చేదును తొలగించుకొని, తియ్యదనం పట్టించుకొంటే రాముడిని దర్శించవచ్చు. మీరు నన్ను ఎలాచూస్తున్నారో, నేను మిమ్మల్ని ఎలాచూస్తున్నానో అలాగ రామచంద్రమూర్తిని ఫిజికల్‌గా కూడా దర్శించవచ్చు.

ఈమధ్య మారోజులు బాగాలేవు, కర్మ అనుభవిస్తున్నాము అని చాలామంది అంటారు. భగవాన్ఏమంటున్నారు అంటే నీలోపలఉన్న చైతన్యం ఏమీ కర్మ అనుభవించదు. నీ అహంభావనే కర్మ అనుభవిస్తుంది. అహంభావనలోనుండి బయటకు వచ్చేసావు అనుకో కర్మ ఏమి చేస్తుంది, కర్మ ఏమీ నిన్ను అంటదు. అహంభావనలో నుండి విడుదలపొందితే నీకు బండెడు దు:ఖం ఉన్నా అదిఅంతా సుఖంగా మారిపోతుంది. అది జ్ఞానం యొక్క వైభవం. దేహం ఉన్నవాడికి జబ్బు గాని, దేహంలేనివాడికి జబ్బు ఏమిటి? మనస్సు ఉన్నవాడికి బెంగ కాని మనస్సు లేనివాడికి బెంగఏమిటి? అహంభావన ఉన్నవాడు కర్మ అనుభవిస్తున్నాను అనుకొంటాడు, అహంభావనలో నుండి విడుదల పొందినవాడికి ఇంక కర్మ అనుభవించటానికి అక్కడ ఎవడైనా ఉంటేకదా, అహంభావన తొలగి నీలోజ్ఞానతేజస్సు ఉదయిస్తే, ఆ జ్ఞానాగ్నిలో ఎంతకర్మ ఉన్నా కాలిబూడిద అయిపోతుంది. నీవు ఏమార్గంలో సాధనచేసినా శ్రద్ధ అవసరం. నీవుచేసే మార్గంలో ఏకాగ్రత అవసరం, ప్రేమ అవసరం, తరించాలనే కాంక్ష అవసరం. అంతశ్రద్ధగా చేస్తే ఆత్మజ్ఞానం సాధ్యమే, ఇందులో సందేహం లేదు. ఆత్మజ్ఞాన సముపార్జనలోనే నీలోని అజ్ఞానం బస్మమవుతూఉంటుంది.

**రమణ భాస్కర**